అరుణతార March 1985 ఏప్రిల్

# రచయిత - బాధ్యత

కె. బాలగోపాల్

రచయితల బాధ్యత గురించి మాట్లాడేటప్పుడు అధికార యంత్రాంగాన్ని గురించి మాట్లాడడమే ప్రధాన మవుతున్నది. ఒక్క కవి లేదా రచయిత అని మాత్రమే కాదు మొత్తం బుద్ధిజీవుల అందరి బాధ్యత ఇదే అవుతున్నది. ఎందుకు అని ప్రశ్నించుకుని కారణాలు వెదుక్కోవాలంటే — రచయితకు ఒక బాధ్యత ఉండాలంటే మొట్టమొదట రచయిత ఉండాలి. రచయిత ఉండాలంటే రచన చేసే స్వేచ్ఛ, ఆ రచనని పాఠకుడు కొనుక్కొని చదువుకునే స్వేచ్ఛ ఉండాలి. అవి లేకపోతే రచయిత లేడు; అతనికో బాధ్యతా లేదు.

అంతేకాదు ఒకరు చేసే రచనను అచ్చువేసే స్వేచ్ఛ ఒక ప్రెస్‌కి ఉండాలి. కాని ఇవ్వాళ వరంగల్‌లో మీరు ఏదైనా ఒక రచనను ఏదైనా ఒక ప్రెస్‌కు తీసుకుపోయి ఇచ్చిచూడండి. వాళ్ళు మొత్తం చదివిగాని దానిని వేస్తామూ వేయమూ అని తేల్చిచెప్పరు. వాళ్ళకి మానసికంగా ఒక 'ఇన్‌స్టింక్ట్' అనేది తయారైంది - దేనిని ముట్టుకోవచ్చు, దేనిని ముట్టుకోకూడదు అని. ఇది మేము ముట్టుకోము అని చెబితే ఇక దానిని ముట్టుకోరు. దానికి ఒక కారణం ఏమంటే దాదాపు ఒక సంవత్సరంన్నర క్రితం అన్ని ప్రెస్‌లలోనూ పోలీసులు ఒక 'అండర్ టేకింగ్' వంటిది తీసుకున్నారు. ఏది అచ్చువేసినా - ముఖ్యంగా కరపత్రాలు - వాటిని ముందుగా పోలీసుస్టేషన్‌లో చూపించి, వాళ్ళు ఒప్పుకున్నతర్వాతే దాన్ని వేసేదీ లేనిదీ ప్రెస్‌వాళ్ళు నిర్ణయించుకుంటారు. (పుస్తకాల సంగతి నాకు తెలీదు.) ప్రెస్‌లపై ఇటువంటి ఆంక్షలు విధించడం వల్ల ముద్రించే స్వేచ్ఛ ప్రెస్‌లకు లేనప్పుడు ఇక రచనలు చేసే స్వేచ్ఛ మీకు ఎక్కడుంటుంది ? పోనీ మీరు చేసే రచనలను ఏ విజయవాడలోనో, హైదరాబాద్‌లోనో అచ్చువేయించి వరంగల్ తీసుకువస్తారనుకుందాం. అవి కొనుక్కొని చదివే స్వేచ్ఛ పాఠకుడికు ఉండాలి. కాని పాఠకుని చేతిలో ఒక పుస్తకంగాని, ఒక కరపత్రం గాని, ఒక కవితగాని కనపడితే - అదే నేరమైతే ఇక మీకు పాఠకులు ఎక్కడుంటారు ? పాఠకులు లేకపోతే మీరు రచయిత ఎలా అవుతారు ? చేతిలో 'సృజన' కనిపించిందని చెప్పి హైదరాబాద్ నుండి వచ్చిన ఒక హైకోర్టు అడ్వకేట్‌ని హనుమకొండ పోలీసుస్టేషనుకు తీసుకుపోయి ఒక రాత్రంతా అక్కడ పెట్టాడు. ఆయన పోలీసుల్ని తిట్టాడనో, బెదిరించాడనో కేసు పెట్టారు. మర్నాడు ఆయనను మేజి

స్ట్రీట్ దగ్గరకు తీసు పోతే ఆయనైనా ఏమిటి పని అని పోలీసుల్ని అడిగే పరిస్థితి లేకపోయినప్పుడు ఇక మీకు పాఠకులు ఎక్కడ్నించి వస్తారు ? మీరు రచయిత లెట్లా అవుతారు ?

ఈ వేళ ఒక్క రచయితలే కాదు, బుద్ధిజీవులనే కాదు, మేధావులనే కాదు దేశంలో ఈనాడు అందరూ ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అదేమంటే తమ బాధ్యత గురించి ఆలోచించకుండా ఉన్నంతకాలం, తమ బాధ్యతల్ని ఆచరించకుండా ఉన్నంతకాలం "తమ బాధ్యత ఏమిటి" అని తర్కించుకునే అవకాశం ఉంటుంది. కాని తమ బాధ్యతల గురించి ఆలోచించి, ఆచరించడం మొదలుపెడితే తాము రచయితలుగాను, బుద్ధిజీవులుగాను, మేధావులుగానూ మాత్రమే లేము: తమ బాధ్యత అన్నది దానిని మించి మొత్తం తమ జీవితమంతా అందులో 'ఇన్‌వాల్వ్' అయిపోయిందని అర్థం చేసుకుంటున్నారు. ఈ పరిస్థితి ఒక్క వరంగల్‌కో, ఒక్క ఆంధ్రప్రదేశ్‌కో మాత్రమే పరిమితమైలేదు. ఇది ఇవ్వాళ దేశవ్యాప్తంగా జరుగుతున్నది. ఢిల్లీలో ఇందిరాగాంధీ చనిపోయిన తర్వాత కాంగ్రెస్ నాయకత్వంలో గూండాలు సిక్కులపై పడ్డారు. ఢిల్లీ నగర పరిపాలకుల, ఢిల్లీ కాంగ్రెస్ (ఐ) నాయకుల అండతో ఈపని జరిగింది. ఒక్క ఢిల్లీలోనే 3000 మంది సిక్కుల్ని చంపారు: బయట ఇంకా చాలా మందినే చంపారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోను, సుప్రీంకోర్టులోనూ పనిచేసే మేధావులు, బుద్ధి జీవులు, వారిలో కొందరు రచయితలు "ఇది చాలా అన్యాయం. దీనికి నిరసన తెలపడం మన బాధ్యత" అనుకుని, ఒక ప్రక్క కాంగ్రెస్ (ఐ) మూకలు, గూండాలు ఢిల్లీలో సిక్కులపై పడి వారిని అమానుషంగా హత మారుస్తున్న సమయంలో వీరు చాలా ధైర్యంగా పరిశోధన జరిపి "WHO ARE THE GUILTY ?" (దోషు లెవరు ?) అని ఒక పుస్తకం వేశారు. ఆ పుస్తకం బయటకు వచ్చాక కాంగ్రెస్ (ఐ) వాళ్ళు వీళ్ళను బాహాటంగా బెదరించారు. అప్పటికి ఇంకా ఎన్నికలు కాలేదు. ఓడిపోతామేమో ననే భయం వాళ్ళకు అప్పటికి ఇంకా ఉన్నది. తర్వాత గెల్చారు. దేశవ్యాప్తంగా 400 సీట్లు సంపాదించు కున్నారు. వాళ్ళు గెల్చారు: వాళ్ళు గెల్చారన్న సంగతి సుప్రీంకోర్టులోనూ, హైకోర్టులోనూ జడ్జీలకి తెలిసింది. అందువల్ల ఒక జడ్జి వీళ్ళని చాలా ధైర్యంగా తిట్టాడు. ఎవరిని ? ఆ రిపోర్టు రాసిన పౌరహక్కుల సంఘాల వాళ్ళని. అంటే పి యు సి ఎల్ - పి యు డి ఆర్ వాళ్ళని. ఆ పత్రికా రచయితలను నీచమైన ("Wretched") జర్నలిస్టులు

అన్నాడు. అందులో పనిచేసిన లెక్చరర్లని "పాఠాలు చెప్పుకోవడం తప్ప ఇటువంటివి — అంటే ఈ పరిశోధనలు చేసే అవసరం మీకు లేదు" అన్నాడు. ఇవ్వాళ కాంగ్రెస్‌వాళ్ళు తమ వెనకాల 400 సీట్లు ఉన్నాయనే ధైర్యంతో పి యు సి ఎల్ , పి యు డి ఆర్ మీద పరువునష్టం దావా వేస్తామని బెదరిస్తున్నారు. పరువునష్టం దావా వేస్తే, ఆనాడు పుస్తకం వేసినప్పుడు ధైర్యంగా ముందుకువచ్చి "నా భర్తను చంపింది ఫలానా ఎచ్ కె ఎల్ భగత్, ఎం. పి, ఆయన మద్దతుదారులు" అని చెప్పిన స్త్రీ ఇవ్వాళ కూడా ధైర్యంగా కోర్టులో ముందుకు వచ్చి "నిజమే నేను చెప్పాను. నా భర్తను వీళ్ళు చంపడం కళ్ళారా చూశాను. అదే చెప్పాను" అని అంటుందా లేదు నేను చెప్పలేదు అంటుందా ? నేను చెప్పలేదు అనే అంటుంది. అప్పుడు ఈ రిపోర్టు రాసిన వాళ్ళ గతేం కావాలి ?

ఇది వాళ్ళు కేవలం బుద్ధిజీవులుగా, మేధావులుగా ఎదుర్కొంటున్నదికాదు. బుద్ధిజీవులుగాను, మేధావులుగాను తమకు బాధ్యత ఉంది అని గుర్తించి వాళ్ళు ఒక పని చేశారు. వాళ్ళు ఈరోజున ఏ పరిస్థితులలో ఇరుక్కొన్నారంటే తమ బాధ్యత బుద్ధిజీవులుగాను, మేధావులుగాను కాదు; తమపై కాంగ్రెస్‌వాళ్ళు తీర్చుకున్న ప్రతీకారం ఒక వ్యక్తిగా, ఒక పౌరునిగా; ఒక మనిషిగా తాము ఒక ఇరుకాటమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు వారు అర్థం చేసుకోవలసి వస్తున్నది.

పంజాబ్ ప్రభుత్వం టెర్రరిజం పేరు చెప్పి అమాయక ప్రజల్ని ఎన్‌కౌంటర్లు'గా కాల్చి చంపడమన్నది, తప్పుడు కేసుల్లో ఇరికించడమన్నది తప్పుఅని నిరసన తెల్పుతున్నవారు ఇంత కల్లోల పరిస్థితిలోనూ పంజాబ్‌లో ఉన్నారు. వారు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రైట్స్ (ఎ ఎఫ్ డి ఆర్)గా పని చేస్తున్నారు. వాళ్ళపై కొన్నాళ్ళ తర్వాత పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం రాజద్రోహం క్రింద వాళ్ళందరిపైనా కేసు పెట్టబోతోందట. ఏ పుస్తకమైతే పియుసి ఎల్, పియుడి ఆర్ ప్రచురించారో ఆ పుస్తకాన్ని పంజాబ్ ప్రభుత్వం నిషేధించిందట. ఆ పుస్తకాన్ని ప్రచారం చేస్తున్నందుకు, అమ్ముతున్నందుకు వారిమీద రాజద్రోహం అని కేసు పెట్టబోతోందట. అందులో వున్నవాళ్ళెవరు ? మంచి బుద్ధిజీవులు, మేధావులు ఐన వాళ్ళు. వారు పంజాబుయూనివర్సిటీలోను, పాటియాలాయూనివర్సిటీలోను ప్రొఫెసర్లగానో, లెక్చరర్లగానో, లేక హైకోర్టులో అడ్వకేట్లగానో ఉన్నవారు వాళ్ళు కేవలం మేధావులుగా, బుద్ధిజీవులుగా గాదు; వాళ్ళ చుట్టూ ఉన్న సంక్షోభంలో ఒక మనిషిగా,

ఒక వ్యక్తిగా, ఒక పౌరుడిగా వాళ్ళవాళ ఈ సమాజంలో వాళ్ళ బాధ్యత ఏమిటి అని ఆలోచించుకోవలసిన అవసరం ఏర్పడింది. (ఈనాడు ఒక్క మన రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగా అధికార యంత్రాంగానికి పూర్తిగా పట్టపగ్గాల్లేకుండా పోయింది. ప్రజలమీద విరుచుకుపడుతోంది "ఎదిరించాలి, నిరసన తెలపాలి" అని నిర్ణయించుకొన్న మేధావులు చాలా త్వరగా యీ విషయాన్ని గుర్తిస్తున్నారు. "మాబాధ్యత కేవలం మేధావిగా మాత్రమే కాదు. మనిషినైన నేను నాబాధ్యత ఏమిటి ? అన్నది నిర్ణయించుకోవలసిన అవసరం ఏర్పడుతోంది. చాలా చోట్ల ఉన్నారు ప్రజల పక్షం నిలిచి అన్యాయానికి వ్యతిరేకంగా మాట్లాడేవాళ్ళు. అవతల అధికార యంత్రాంగానికి, ప్రభుత్వానికీ పోలీసులకు, పారా మిలిటరీవాళ్ళకి విచ్చలవిడిగా అత్యాచారాలు చేయడం అలవాటైపోయింది. అది యెక్కడిదాకా పోయిందంటే, ఉత్తరప్రదేశ్‌లోను, మధ్యప్రదేశ్‌లోను, రాజస్థాన్‌లోను, 'డెకాయిట్లని' కనిపించిన ఏ 'డెకాయిట్' నైనా సరే కనబడ్డవెంటనే కాల్చిచంపవచ్చునని పోలీసులకు ఫ్రీహాండ్ యిచ్చారు. వాళ్ళవాళ అరుసార్లు ఎంఎల్ఎ గా ఎన్నికైన వ్యక్తిని (ఒక రాజవంశంలోని వాడట) కాల్చి చంపేశారు. ఈ వేళ రాజీవ్‌గాంధీ సంతాపంతెలిపాడు, రాజస్థాన్ ముఖ్యమంత్రి రాజీనామా చేశాడు యింక యేడ్చి మాత్రం ఏం ప్రయోజనం, కాల్చి చంపమని ఆ పోలీసులకి నేర్పిందెవరు ? నేరస్థుడు అని అనిపించినప్పుడు కనబడగానే కాల్చి చంపవచ్చని నేర్పించిందెవరు ? వాళ్ళే నేర్పించారు.

(పంజాబులో టెర్రరిస్టు ప్రాంతంఅని ఒక ప్రత్యేక చట్టాన్ని తయారు చేశారు. చాలా భయంకరమైన చట్టం టెర్రరిస్టు అని ఎవరిమీదైనా నేరం ఆరోపిస్తే, ఆ చట్టం ప్రకారం నేను చెయ్యలేదు అని అక్కడే నిరూపించుకోవాలి మూడుచోట్లలోను, కోర్టులు పెట్టారు. పాటియాలాలోను జలంధర్‌లోను, లూధియానాలోనూ - ఆ కోర్టుల్లో 800 కేసులు పెట్టారు. కేసుల వత్తిడి ఎక్కువయిపోయి, రోజుకు 20 కేసులు విచారణకు వస్తున్నాయట. అందులో ఎక్కువ కేసు లేమిటంటే మన వరంగల్‌లో లాగే బాంబులు దొరికాయని ఈ కేసులు కేసులలో. వాస్తవమేమిటో పరిశోధించటంగాని, విచారించడంగాని వాళ్ళకేం చేతకాదు. కాని పట్టుకుపోయినవాళ్ళ దగ్గర బాంబులు దొరికాయి అని చెప్పడం మాత్రమే వాటికి చాతనవుతుంది. అది వరంగల్ అయినా అంతే, పాటియాలా అయినా అంతే. కాని వాటిలో అత్యధికంగా ఉన్న కేసులు మాత్రం బాంబులు దొరికాయనేవి. కాని ఒక తేడా ఉంది. వరవర రావుగారింటిలో బాంబులు దొరికాయని ఆయనపై కేసు పెట్టారు. అరెస్టు చేశారు.

బెయిల్ రాకుండా చేద్దామని ప్రయత్నం చేశారు. బయటకు వస్తే మళ్ళీ అరెస్టు చేశారు.

కాని ఆయన యివ్వాళ బయట ఉన్నారు. యిక్కడ వున్న చట్టం ప్రకారం ఆయన యింట్లో బాంబులున్నాయని పోలీసులే రుజువుచెయ్యాలి. కాని వాస్తవానికి వాళ్ళింట్లో బాంబులు దొరికిందే లేదు. సోదా చేసిందీ లేదు, పరిశోధన చేసింది లేదు, పంచనామా కూడా చేసిందేమీ లేదు. కాబట్టి ఆయన మీద కేసు కొట్టివేయబడుతుంది. కాని అదే పంజాబులో ఇతే టెర్రరిస్టు ప్రత్యేక కోర్టుల చట్టం క్రింద కేసులు పెట్టబడి బడినాయి గనుక మా యింట్లో బాంబులు దొరకలేదని పరవరరావుగారే రుజువు చేసుకోవాలి. ఆయనెలా రుజువు చేసుకుంటాడు? ఆయనా సమయంలో లాకప్‌లో వున్నాడు ఆయన యింట్లో లేని సమయంలో బాంబులు దొరికాయి అనంటే, దానికి ఆయనే బాంబులు దొరకలేదు అని రుజువు చేసుకోవాలంటే అదెలా సాధ్యం? అందువల్ల ఆయనకు శిక్షపడటం ఖాయం. మనం యిప్పుడు జరిగిపోయిన విషయాల్ని గురించి మాట్లాడ్డం లేదు. ఈవేళ పంజాబ్‌లో అనేకంగా 800 కేసులు విచారణలో వున్నాయి. పంజాబులోనే గాదు. అంతకంటే సీరియస్ అనుకున్న కేసులు రాజస్థాన్లో, జోధ్‌పూర్‌లో, విచారణ జరుగుతున్నాయి. అవసరమైతే తమిళనాడులో విచారణ జరుపుతారట. 800 కేసులు— ఒక్కొక్క కేసులో 20 మందో, 30 మందో ముద్దాయి అనుకుంటే కొన్నివేలమంది ముద్దాయిలు. తాము చేసిన నేరాలమిటో, చెయ్యని నేరాలమిటో అరెస్టు చేయబడి, వారి మీద వున్న కేసుల్ని మేము చెయ్యలేదు అని వారే రుజువు చేసుకోవాల్సిన పరిస్థితికి వారు నెట్టబడ్డారు. ఈవిధమైన అన్యాయం అక్కడ సాగుతోంది.

ఒక మేధావి అనేవాడు పంజాబులో కూర్చుని, ఇది అన్యాయమని దానికి "ప్రొటెస్ట్" చేస్తే అతనింట్లో కూడా బాంబులు దొరుకుతాయి! ఆయననూ అరెస్టు చేస్తారు. ఆతని మీద కూడా ప్రత్యేక కోర్టుల చట్టంక్రింద కేసులు పెడతారు. దాని ప్రకారం ఆయన బాంబులు దొరకలేదని రుజువు చేసుకోలేడు. కాబట్టి అతన్ని జెయిల్లో పెడతారు. ఏ ప్రజల కోసమైతే తాను ప్రొటెస్ట్ చేస్తున్నాడో వాళ్ళతో పాటుగా తాను కూడా జైల్లో కూర్చుంటాడు.

ఈ పరిస్థితులలో మేధావి యైనవాడు తన బాధ్యత ఏమిటి? అని చాలా విస్తృతమైన పరిధిలో ఆలోచించవలసిన అవసరం వున్నది. ఇలా జరిగేది ఒక

ప్రాంతంలో కాదు, ఒక్క రాష్ట్రంలో కాదు, దేశవ్యాప్తంగా వుంది అనే విషయం మనకొకరకంగా ఊరట కలిగిస్తుంది. మన ఆంధ్రప్రదేశ్‌లో గత సంవత్సరం 24 మందిని పోలీసు లాకప్పుల్లో చంపారు. చాలామంది ఏమనుకొంటారంటే ప్రమాదకర మైన నేరస్తులు కాబోలు, చంపారు అని అనుకుంటారు.

కాని వాస్తవంగా యిద్దరు మాత్రమే అలాంటి పరిస్థితిలో అరెస్టు చేయ బడ్డారు. అంటే వాళ్ళను చంపవచ్చు అని చెప్పడం కాదు. ఒకతను డెకాయిటీలో నేరస్తుడు. మరొకడు ఒక దొంగతనం కేసులో నేరస్తుడు. తక్కిన 22 మంది కూడా చిన్నచిన్న నేరాలు మీద అరెస్టు చేయబడినవాళ్ళే అంటే జేబు దొంగతనం చేస్తున్నా డనో, లేక జేబులో ఒక వెయ్యిరూపాయలు పెట్టుకుని అవెక్కడనుంచి తెచ్చాడో చెప్పలేకపోయాడనే మిషమీదనో, లేక వీధుల్లో అవారాగా తిరుగుతున్నాడనే నేరం మీదనో అరెస్టు చేయబడిన వాళ్ళే. కాజీపేటలో సుదర్శన్‌ని ప్రచారం చేస్తున్నాడని చంపారు. సారంగపాణిని అయితే చంపాలనుకున్నారు. చంపారు. వాళ్ళు చంపా లనుకున్నారు కాబట్టి తీసుకుపోయి చంపారు. దీనిలో అనుమానమేమీ అవసరం లేదు. ఇదీ పరిస్థితి.

ఈ పరిస్థితిలో బాధ్యత గురించి మాట్లాడేటప్పుడు రచయితలుగానో, మేధావులుగానో రచనలకు మాత్రమే పరిమితం కావాలన్నది సాధ్యం కాదు. రచనలు కొనుక్కొని చదువుకునే అవకాశం ప్రజలకు లేనప్పుడు, రచయితగానే మీ బాధ్యత ఎక్కడుంటుంది? ఉండదు ఈవేళ మన బాధ్యత అన్నది ఏమిటో చాలా విస్తృత మైన పరిధిలో మనం ఆలోచించాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పుడు మనదేశంలో ఎన్నికలు జరుగుతున్నాయి. మొన్న జరిగినవి, యివ్వాళ జరుగుతున్నాయి, రేపు జరుగుతాయి. కాని ఈనాడు ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య ఒక అంతర్యుద్ధం సివిల్ వార్ లాంటి వాతావరణం కనిపిస్తోంది. యుద్ధం అంటే ఎందుకొచ్చింది అనడంలేదు. అటువంటి పరిస్థితి ఏర్పడిపోయింది. ఒక రచయిత కానివ్వండి, మేధావి కానివ్వండి, బుద్ధిజీవి కానివ్వండి తాను ఏపక్షాన నిలబడతాడో తేల్చుకోవాల్సిన అవసరం యీనాడు దేశంలో చాలా బలంగా ఏర్పడింది. ఆ నిర్ణయించుకోవడ మన్నదే ఈ రోజు ప్రధానమైన అంశంగా మారిపోయింది. ఎందుకంటే ఈ రోజున రచయితకు రచయి తగా బాధ్యత లేదు, మేధావికి మేధావిగా బాధ్యత లేదు; సైంటిస్టుకి సైంటిస్టుగా బాధ్యతలేదు. భోపాల్‌లో విషవాయు ప్రభావంతో 3 వేలమంది చనిపోయారు.

అంతేకాక 2 లక్షల మందికి కళ్ళు పోవడమో లేక జీర్ణకోశం పాడవటమో జరిగింది. ఒక సైంటిస్టుగా డాక్టర్ నీల్‌సద్ గోపాల్ అనే వ్యక్తి బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్‌లో పనిచేస్తూ ప్రజలలోకి విజ్ఞానశాస్త్రాన్ని తీసుకుపోవాలనే ఉద్దేశ్యంతో, తన ఉద్యోగానికి రాజీనామా చేసి స్వదేశానికి వచ్చి, మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వ సహకారంతో, తానునేర్చిన హైటెక్నాలజీని ప్రజలకందించాలనే సదుద్దేశంతో 'కిషోర్ భారతి' అని ఒకసంస్థ స్థాపించి ప్రభుత్వ సహకారంతో నడిపిస్తున్నాడు. భోపాల్ విషాదం తెలిసినతరువాత అతను ఒకసైంటిస్టుగానే ఉండిపోవటంకాదు అని భావించి ఆయన వెంటనే భోపాల్ వెళ్ళాడు. చనిపోయినవాళ్ళు చనిపోగా మిగిలిన 20 లక్షల బాధితులను చేరవేసి వాళ్ళకు ప్రభుత్వం యేమిచేసిందని ఒక ఉద్యమం లాంటిది నడుపుతున్నారు. ఆయన్ని ఇప్పటికి ఒకసారి అరెస్టుచేశారు. కాని ఆయన పెద్ద పేరున్న సైంటిస్టు కాబట్టి వత్తిడికి తట్టుకోలేక వదలి పెట్టారు. రేపు ఈ ఉద్యమం ముగింపుకి వచ్చేసరికి ఆయనకు ఒక విషయం అర్థమవుతుంది. విజ్ఞానవేత్తగా నాకొక బాధ్యత వుందని నేను ఎందుకు దిగాను. కాని విజ్ఞానవేత్తగా ప్రభుత్వం తనని గుర్తించక ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న ఒక వ్యక్తిగా తనమీద కక్ష తీర్చుకుంటుందని ఆయనకు అర్థమవుతుంది. ఉద్యమంనుంచి బయటికి వచ్చాక కిషోర్ భారతి సంస్థకు ప్రభుత్వ సహాయం ఆగిపోవచ్చు. లేదా ఆ సంస్థనే ప్రభుత్వ వ్యతిరేక సంస్థగా, రాజద్రోహ సంస్థగా ప్రకటించవచ్చు. అప్పుడు ఆయనకొక విషయం అర్థమవుతుంది.

ఒక మనిషిగా నేనెవరి పక్షాన నిలుచోవాలి ? అని ఆలోచించుకునే అవసరం ఆయనకు వస్తుంది. ఆయనకేకాదు, అదే పరిస్థితి యీనాడు మనందరిముందు ఉన్నది అటువంటప్పుడు మనం మన నిర్ణయాన్ని ప్రజలకు అనుకూలంగానే తీసుకోవలసి ఉంటుంది. అదే మేధావులుగా, రచయితలుగా, వ్యక్తులుగా, పౌరులుగా మన బాధ్యత.

(25-2-85 న వరంగల్‌లో జరిగిన సభలో చేసిన ప్రసంగపాఠం)